# దొంగ

ఆలాపన మంత్లీ, సెప్టెంబర్, 2003



భార్య నోట విన్న ఆ మాట విని మరోసారి అవాక్కయిపోయాడు గంగాధరం.

"నిజమా నీలూ..! ఏమిటోఁ... నమ్మలేకపోతున్నాను!" పుస్తకాల్ని రేక్‌లో సర్దుతూ అన్నాడు.

"ఏం చెప్పమంటారు చెప్పండి..! అసలు ఈ ఊరే అంత ఏమో!?" అంది కాఫీ ఇస్తూ.

"ఇది దొంగల సామ్రాజ్యంలా ఉంది మొత్తానికి!"

"చూస్తుంటే అలాగే ఉంది. లేకపోతే ఏమిటి చెప్పండి... పనిమనిషిని నమ్మి అత్తగారికి కాపలా ఉండమంటే ఇంత ద్రోహం చేస్తుందా?" అంది నీలవేణి ముఖానికి పట్టిన చెమటల్ని చీరచెంగుతో తుడుచుకుంటూ.

"ఏమిటే అమ్మాయీ... ఈ చోద్యం? బీరువాలో పెట్టిన వెయ్యిరూపాయలు పోయాయంటే వింతగా ఉంది. అసలు ఆ పనమ్మాయిని ఇంట్లోకి రానివ్వడం లేదు. వరండాలో కూర్చోపెట్టి, నేను అక్కడే మంచం వేసుకుంటున్నాను. కళ్ళు కప్పి కన్నం వేసుకుపోయింది!" తన్నుకు వస్తూన్న దగ్గును దిగమింగుకుంటూ అంది రాజమ్మ.

"ఈరోజుల్లో అంతా అంతేనండీ! లేకపోతే మొన్నటికి మొన్న- ఆ రమణమ్మ ఏంచేసింది చెప్పండి... ఏదో ఆయన ఉదయాన్నెప్పుడో ఆఫీసుకు పోతారు. నేను స్టౌవ్ మీద ఇంత వండిపడేసి నా ఉద్యోగానికి నేను వెళ్లాలి. ఇంక ఇంట్లో ఉన్నది టింకూగాడు! ఎప్పుడో ఉదయం అనగా వెళ్లినవాడు రాత్రి ఎనిమిది గంటల వరకు రాడాయె! మీరా పెద్దావిడ... ఇంట్లో మిమ్మల్ని ఒక్కర్నీ వదిలేసి ఆఫీసుకు ఎలా వెళ్లడం? మనుషుల్ని కాపలా పెట్టి పోతే... వాళ్ళంతా అందినవి దండుకొని తగినశాస్తే చేస్తున్నారు!" కోడలు నీలవేణి ఈసడిస్తూ అంటుంటే తనకీ బాధగా అన్పిస్తోంది రాజమ్మగారికి.

గంగాధరంకి స్కూలు మాష్టారు ఉద్యోగం! 'చన్నీళ్లకి వేన్నీళ్లలా నేనూ ఉద్యోగం చేస్తాను. ఖాళీగా కూర్చొని ఏం చేస్తాను?' అని నీలవేణి అంటే మొదట్లో తటపటాయించాడు.

"చూడండీ! మన టింకూ ఇంటర్మీడియట్‌కి వచ్చేశాడు. రేపు ఏ ఇంజనీరింగో చదివించాలంటే మనకు అయ్యే పనేనా? అందుచేత నాకు వచ్చిన అవకాశాన్ని కాలదన్నుకుంటే ఎలా?"

భార్య మాటలు సహేతుకంగానే అన్పించాయి గంగాధరానికి. తన ఉద్యోగం... భార్య ఉద్యోగం... కొడుకు చదువు! అంతా బాగానే ఉన్నా వచ్చిన చిక్కు- తన ముసలి తల్లి! అందరూ బయటికి వెళ్లిపోతే ఆవిడను ఎవరు చూస్తారు?

తనకు తన కొడుకు ఒక్కడు ఎలాగో... తన తల్లిదండ్రులకు తనూ ఒక్కడే! 'అత్తగారి గురించి పెద్దగా గాబరా పడకండి! ఆవిడకా... ఓపిక తగ్గింది. మనిషి లేవలేదన్నది, అస్తమానం మనిషి సహాయం కావల్సిన మాట వాస్తవమే! ఎవరో ఒక మనిషిని మనం వచ్చేవరకు కుదిర్చి పెడితే సరి!"

భార్య మాటలు బాగానే అన్పించాయి గంగాధరానికి.

మొదట్లో 'మీరమ్మ' అనే ఒక ముసలామెను మాట్లాడి అత్తగారికి సాయంగా ఉండమంది నీలవేణి. తీరా వారంరోజులు తిరక్కముందే ఇంట్లో తన వెండిపట్టాలు మాయమయ్యాయి. ఈ పనిమనుషులు ఎప్పుడూ చేతివాటానికి పాల్పడతారని, వాళ్ళని నమ్మకూడదని పని మాన్పించింది.

తరువాత 'గౌరి' అనే చిన్నపిల్లను తెచ్చిపెట్టింది. రెండురోజులు పోయేసరికి బల్లమీద పెట్టిన రెండువందల రూపాయలు మాయమయ్యాయి.

ఈసారి అలాకాదని తన స్కూలులో పనిచేస్తున్న పనిమనిషి పోలమ్మ కొడుకు చంద్రరావుని తల్లికి తోడుగా ఉంచాడు గంగాధరం.

బాగానే కనిపెట్టుకొని ఉన్నాడనుకుంటుంటే... ఒకరోజు ఇంట్లో గిన్నెలు మాయమయ్యాయి.

ఇప్పుడున్న పనిమనిషి ద్వారా మరో డబ్బు దొంగతనం!

రాజమ్మకు కూడా చాలా బాధ అన్పిస్తోంది. 'కొడుక్కి తను బరువు అయి కూర్చున్నా'నన్న వేదన తన ముసలితనాన్ని మరింత భారంగా చేస్తోంది.

"ఈరోజుల్లో అందరూ ఇంతే! 'ఏదో తిండికి కరువువాచిన వాళ్ళు... సహాయపడదాం!' అనుకుంటే- చేతివాటానికి పాల్పడడం, అందిన మట్టుకు తీసుకుపోవడం.., దొరికినవి దోచుకుపోవడం..."

గంగాధరం శివమెత్తి మాట్లాడుతున్నాడు.

భర్త మాటలకు వత్తాసు పలుకుతోంది నీలవేణి.

"బీదవాళ్ళు- బీదవాళ్ళు' అని జాలి చూపుతామే గాని, బుద్ధుల్ని పట్టే భగవంతుడు వాళ్ళని అలా పుట్టిస్తాడు. తరువాత ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచుతాడు!"

ఏం చేయాలో పాలుపోక సతమతమవుతన్నాడు గంగాధరం.

వంటింట్లో కూర్చొని కూరలు తరుగుతూన్న నీలవేణి మొగుడి మాటల్ని ఆలకిస్తూనే ఉంది.

'బుద్ధుల్ని పట్టే దేవుడు వాళ్ళని పేదవాళ్ళుగా పుట్టిస్తాడు!' అని విన్న ఆమె మనసు ఆర్ద్రతతో నిండిపోయింది.

'తమ అవసరంకొద్దీ అత్తగారికి సహాయం కోసం తెచ్చుకొని, ఇప్పుడు వాళ్ళ నిజాయితీని శంకిస్తున్నాము. ఇంట్లో పోయిన వస్తువులన్నీ పనివాళ్ళే పట్టుకుపోయారని నేరారోపణ చేస్తున్నాం! ఇంటిదొంగల గురించి ఎవరూ అనుకోవడం లేదు. టింకూ సరిగ్గా చదవకపోగా అల్లరిచిల్లరి స్నేహాలకు అలవాటు పడుతున్నాడు. ఇంట్లోనివన్నీ ఎవరికీ తెలియకుండానే బయటకు చేరవేస్తున్నాడని వారి ద్వారా, వీరి ద్వారా తనకు తెలుస్తూనే ఉంది. ఆయనకు తెలిస్తే వాడిని బ్రతకనీయడు. చాటుగా ఎన్నిసార్లు మందిలంచినా బుద్ధి రావడం లేదు వాడికి!' బాధగా నిట్టూర్చింది.

కొడుకు చేస్తున్న వెధవ పనులను గుర్తించక, పొట్టకోసం వచ్చినవాళ్ళని దొంగలను చేయడానికి మనస్కరించడం లేదు నీలవేణి అంతరంగం. కానీ, ఒక తల్లిగా కొడుకు మీదున్న మమకారం ముందు అవన్నీ గాలికి కొట్టుకుపోతున్నాయి.

...యథాప్రకారం మొగుడు మాటతో జతకలిపింది అయిష్టంగానే.